# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 19, జూన్ 2026


# భార్య భర్తల దారుణ హత్య...?

## ✧ పీరిల ఉదాంతమే ప్రాణం తీసిందా..!



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 18, ప్రభాతవార్త :



రాజునాయక్, సుశీల (ఫైల్‌ఫోటో)

ఆసిఫాబాద్ మండలంలోని కోసరా గ్రామ పంచాయతీలో గల భవాని నగర్ తాండలో భార్య భర్తల హత్య బుధవారం రాత్రి సంఘటన చోటు చేసుకున్నట్లు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేర్కొనడం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం బానోత్ రాజునాయక్ (50), సుశీల (45) బుధవారం రాత్రి ఇంటి ముందట పడుకున్న చోట హత్యకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. గతంలో కోసరాలో పీరిల ప్రతిమలు దొంగలించబడ్డాయి. ఇదే సంఘటన పోలీస్ స్టేషన్‌లో సైతం కేసు నమోదు చేయడం జరిగింది. ఇదిలా ఉంటే గ్రామస్తులు రాజునాయక్ చందాలతో ఈసారి పీరిల ప్రతిమలు చేయించి బుధవారం రోజున కోసరాలోని పీరిల బంగ్లాలో ప్రతిష్టాపించడం జరిగింది. గతంలో పీరిల ప్రతిమలు దొంగిలించిన ఆగంతకులు ఈసారి రాజునాయక్‌కు పీరిల దేవుడు రానుండడంతో ఆగంతకుల వివరాలు వెల్లడిస్తే ఇబ్బంది అవుతుందని భావించి ఈ ఆగంతకానికి పాల్పడినట్లు మృతుల బంధువులు తెలిపారు. పథకం ప్రకారమే భార్య భర్తలను హత్య చేసినట్లు వారు అన్నారు. బుధవారం రాత్రి పీరిల బంగ్లా పూజ అనంతరం రాజునాయక్ ఇంటి వద్ద హాలులో భార్యభర్తలు నిద్రలో ఉపక్రమించడంతో అర్ధరాత్రి విద్యుత్ సరఫరా నిలిపివేసి ఈ ఆగంతకానికి పాల్పడినట్లు కుమారులు సైతం ఫిర్యాదులో పేర్కొనడం జరిగింది. ఉదయం ఈ సంఘటన కలకలం రేపింది. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. అందరితో కలుపుగోలుపుగా ఉండే రాజునాయక్ సుశీల దంపతులు ఇక లేరు అని తెలువడంతో గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇదే విషయంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం కొరకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. కేసును ఆసిఫాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



## ❋ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, జూన్ 18, ప్రభాతవార్త

ప్రభుత్వ విద్యాసంస్థల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు ఆదేశించారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భోజనశాల, అదనపు తరగతి గదులు, వంటశాల, స్టోర్‌రూమ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థులకు వేర్వేరు మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, అదనపు గదులు వంటి సదుపాయాలను సమకూర్చి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు, వంటలో పరిశుభ్రత పాటించాలని, నిత్యవసర సరుకులను మిగతా 2లో..

# యూరియా యాప్‌లో రైతన్నకు యాతన..




- ❁ సాంకేతిక పేరుతో కొత్త చిక్కులు... గిరిజన గ్రామాల్లో సిగ్నల్ సమస్యలు
- ❁ స్టాక్ సమాచారం డీలర్ల అనుకూల రైతులకు ముందుగానే చేరుతోందన్న ఆరోపణలు
- ❁ సాధారణ రైతులకు దొరకని యూరియా... పెరుగుతున్న అసంతృప్తి

పెంచికల్‌పేట్, జూన్ 18, ప్రభాతవార్త :

రైతులు ఎరువుల కోసం దుకాణాల వద్ద గంటల తరబడి లైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్ అనేక ప్రాంతాల్లో రైతులకు కొత్త తలనొప్పిగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులు తమ మొబైల్ ఫోన్లో యాప్ ను డౌన్లోడ్ చేసుకొని ఫోన్ నెంబర్, ఆధార్, పట్టాదారు పాసుబుక్ వివరాలతో నమోదు చేసుకున్న తర్వాత యాప్ లో కనిపించే స్టాక్ ఆధారంగా ఎకరానికి ఒక యూరియా బస్తా చొప్పున బుక్ చేసుకునే విధానాన్ని అమలు చేస్తున్నారు. బుకింగ్ అనంతరం సంబంధిత ఎరువుల దుకాణంలో నగదు చెల్లించి యూరియా పొందాల్సి ఉంటుంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది రైతులకు యాప్ వినియోగంపై అవగాహన లేకపోవడం, నమోదు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురవడం, ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో మొబైల్ సిగ్నల్ అందుబాటులో లేకపోవడం వల్ల యూరియా పొన్నెందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాప్‌లో నమోదు చేయలేకపోతున్న పలువురు రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందుతున్నారు. మరోవైపు యూరియా స్టాక్ అందుబాటులోకి వచ్చిన వెంటనే కొందరు డీలర్లు తమకు అనుకూలమైన రైతులకు ముందస్తుగా సమాచారం అందజేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వారు వెంటనే బుకింగ్ చేసుకోగా మిగతా 2లో..

# ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

ఆసిఫాబాద్, జూన్ 18, ప్రభాతవార్త

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం రెబ్బెన మండల కేంద్రంలో అటవీ క్షేత్ర అధికారి కార్యాలయ ఆవరణలో అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని రక్షించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరుప్రక్కల, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్యశాలల, పాఠశాలలు, కళాశాలలో ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు, ప్రజలకు అడిగిన మొక్కలు అందించాలని, మొక్కలు నాటడమే కాకుండా రక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన అటవీ రేంజ్ అధికారి రవి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అనంతరం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నమోదు సంఖ్య శత శాతం ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలలో చేర్చేలా ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, అల్పాహారం, రుచికరమైన మధ్యాహ్న భోజనంతోపాటు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

క్రమపద్ధతిలో నిల్వ ఉంచాలని సూచించారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి నిర్మాణ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి బెల్లంపల్లి మండల కేంద్రంలో అమృత్ 2.0 పథకం కింద నిర్మాణంలో ఉన్న నీటి ట్యాంకులు, పైప్‌లైన్ పనులను తహసిల్దార్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమేష్, చైర్‌పర్సన్ దావ స్వాతి తదితరులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు నిరంతర త్రాగునీటి సరఫరా కోసం ఈ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణను పటిష్టం చేయాలని, ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను రోజువారీగా సేకరించాలని సూచించారు. డంపింగ్ యార్డ్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, నిరుపేదల కోసం చేపట్టిన ఈ గృహ నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

## - 72 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు

సిర్పూర్ (టి), జూన్ 18, ప్రభాతవార్త :



తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను గురువారం సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు 72 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయాన్ని అందిస్తోందన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాలపై వివాహ సమయంలో పడే ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు మండల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, సిర్పూర్ (టి) మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం మంజూరైందని తెలిపారు. ఈ పనులు త్వరలో ప్రారంభమై పట్టణానికి మరింత అందాన్ని తీసుకువస్తాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్ఐ ప్రవీణ్, వేణు, సిర్పూర్ సర్పంచ్ వడ్డెటి నాగమణి నానయ్య, సర్పంచులు రాందాస్, శత్రు నాయక్, మానేపల్లి శ్రీనివాస్, భీమావు, ఉపసర్పంచులు ప్రశాంత్, శేఖర్, మోహన్, వార్డు సభ్యులు గణేష్, సాయి, మచ్చ గణేష్, నాయకులు అశోక్, బండ రవి, నల్గొండ రాజశేఖర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ 12 ఏళ్ల సుపరిపాలనకు గుర్తుగా లబ్ధిదారుల సమావేశం

## - విశ్వకర్మ, ముద్ర లోన్ పథకాలతో ఆర్థిక సాధికారత సాధ్యం రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాల, జూన్ 18, ప్రభాతవార్త



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల విజయవంతమైన సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో విశ్వకర్మ, ముద్ర లోన్ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించారు. ముఖ్యంగా విశ్వకర్మ, ముద్ర లోన్ వంటి పథకాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెరిగి, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక సాధికారతకు బలమైన పునాది ఏర్పడిందన్నారు. దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు చేరేలా కేంద్ర ప్రభుత్వం అనేక ప్రజాహిత పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ పథకాల వల్ల వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతూ జీవనోపాధిని మెరుగుపరుచుకుంటున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు నాగనూరి వెంకటేశ్వర్ గౌడ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గాజుల ముఖేష్ గౌడ్, ఎనగందుల కృష్ణమూర్తి, ఆకుల అశోక్ వర్ధన్, రంగా శ్రీశైలం, నంపెల్లి శ్రీనివాస్, కొండ మురళి, జయరాం రావుతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగగా, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను మరింత మందికి చేరవేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

## ✳ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

నస్పూర్, జూన్ 18, ప్రభాతవార్త



జిల్లాలోని ఎల్.పి.జి. వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యక్ష లబ్ధి బదిలీ పథకం ద్వారా గ్యాస్ రాయితీని నిరంతరంగా పొందేందుకు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌పిజి వినియోగదారుల బ్యాంకు ఖాతాలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో అనుసంధాన చేసే ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయని వినియోగదారులు ఈ నెల 30వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయని వినియోగదారులకు రాయితీ జమ కావడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఎల్.పి.జి. రీఫిల్ సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

### రేషన్ కార్డుదారులు ఈ-కెవైసి పూర్తి చేయాలి..

జిల్లాలోని రేషన్ కార్డుదారులందరూ తప్పనిసరిగా ఈ కెవైసి పూర్తి చేయాలని తెలిపారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రతి రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరూ ఈ-కెవైసి పూర్తి చేయడం తప్పనిసరి అని తెలిపారు. రేషన్ కార్డులో ఉన్న సభ్యుల పారదర్శకతను నిర్ధారించడానికి, నకిలీని నిరోధించడానికి, అర్హత కోల్పోయిన వారిని గుర్తించి రికార్డులను నవీకరించేందుకు ఈ-కెవైసి ప్రక్రియ ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటివరకు ఈ కెవైసి చేయించుకోని రేషన్ కార్డుదారులు తమ సమీపంలోని రేషన్ దుకాణాలను సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన ఈ పీఓఎస్ యంత్రం ద్వారా వెంటనే పూర్తి చేయించుకోవాలని తెలిపారు.

# యూరియా యాప్‌లో రైతన్నకు యాతన..

(మొదటిపేజీ తరువాయి)

సాధారణ రైతులు యాప్ లోకి వెళ్లే సమయానికి స్టాక్ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో పారదర్శకత లోపించిందని రైతులు ఆరోపిస్తున్నారు. కొంతమంది డీలర్లు ముందుగానే బుక్ చేయించిన యూరియా బస్తాలను తిరిగి సేకరించి అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉందన్న అనుమానాలు కూడా రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. యూరియా పంపిణీలో సమానత్వం కోసం ప్రతి రెండు మూడు గ్రామాలకు ఒక ప్రత్యేక పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు సూచిస్తున్నారు. అలాగే మొదటి విడతలో అర్హులైన రైతులందరికీ యూరియా అందిన తర్వాతే రెండో విడత పంపిణీ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం యాప్ విధానంలో అవసరమైన మార్పులు చేసి అందరికీ సులభంగా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :

జిల్లాలో ఆరోగ్య సేవల అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా మాతా శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి (పిఓ-ఎంసీహెచ్), డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డిప్యూటీఎంహెచ్ఓ) డాక్టర్ నాగేందర్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) సూపర్వైజర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు శాతం 100 పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కార్యక్రమం పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, గర్భిణుల సంరక్షణ, శిశు ఆరోగ్యం, టీకాల కార్యక్రమం, కుటుంబ సంక్షేమం, అంటువ్యాధుల నియంత్రణతో పాటు ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని, లక్ష్యాల సాధనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని తెలిపారు. కార్యక్రమాల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో సీహెచ్‌ఓలు కోటేశ్వర్, వాసుదేవ్, మహాలక్ష్మి, డీఈఎంఓ, ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# మహిళా శక్తికి మారుపేరు రాణి ఝాన్సీ లక్ష్మీబాయి

## - స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగం చేసిన వీరవనితకు నివాళులు

**మందమర్రి, జూన్ 18, ప్రభాతవార్త**



భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన వీరవనిత, స్వాతంత్ర్య సమరయోధురాలు రాణి ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతిని గురువారం మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఆర్మీ జవాన్, ప్రస్తుతం సింగరేణి ఎస్ అండ్ పీసీ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ పివ్ హాల్, రాణి పివ్ హాల్ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాణి ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. పురుషోత్తం మాట్లాడుతూ రాణి ఝాన్సీ లక్ష్మీబాయి భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత కీలక పాత్ర పోషించిన మహనీయ నాయకురాలని పేర్కొన్నారు. 1828లో వారణాసిలో మణికర్ణికా తంబేగా జన్మించిన లక్ష్మీబాయి చిన్నతనం నుంచే గుర్రపు స్వారీ, కత్తి యుద్ధం వంటి విద్యలను అభ్యసించి అసాధారణ ధైర్యసాహసాలను ప్రదర్శించారని తెలిపారు. 1857లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తొలి స్వాతంత్ర్య సంగ్రామంలో ఆమె ప్రదర్శించిన వీరోచిత పోరాటం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన ఝాన్సీ రాణి ధైర్యం, దేశభక్తి, అచంచల సంకల్పం నేటికీ యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తి భావాలను పెంపొందించుకోవడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాజేష్ పివ్ హాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ చైతన్యం పెంపొందించే లక్ష్యంతో స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల జయంతులు, వర్ధంతులను పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశం కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయుల చరిత్రను యువతకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, మరియమ్మ, వాణి, దేవి జయశ్రీ, కల్పలత, రవీందర్, ప్రసాదరావు తదితరులు, విద్యార్థులు పాల్గొని రాణి ఝాన్సీ లక్ష్మీబాయికి ఘన నివాళులు అర్పించారు.



భూమిపూజ చేస్తున్న సర్పంచ్‌లు బడి పోతన్న, సబ్లె దేవిసింగ్

## ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసిన సర్పంచ్‌లు

**సారంగాపూర్, జూన్ 18, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా గురువారం మండలంలోని సాయినగర్ తండా, దని గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సర్పంచ్‌లు భూమిపూజ చేశారు. సాయినగర్ తండాలో సర్పంచ్ సబ్లె దేవిసింగ్, దని గ్రామంలో సర్పంచ్ బడి పోతన్నలు లబ్ధిదారులతో కలిసి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనందుకు లబ్ధిదారులు సర్పంచ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాబ్లే నానక్‌సింగ్, ప్రకాష్ నాయక్, బాపురావు, బాబూలాల్, మల్లేష్, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి కిరణ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ జాదవ్ కైలాస్

## ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసిన సర్పంచ్

**సారంగాపూర్, జూన్ 18, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని బంద్రేవు తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. సర్పంచ్ జాదవ్ కైలాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించి, ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి ఉచిత సౌకర్యాలను, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అరుణ్ కుమార్, భీమేష్, అంగన్‌వాడీ టీచర్ వత్సల, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులను సన్మానించిన సర్పంచ్

**సారంగాపూర్, జూన్ 18, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండల కేంద్రంలో విధులు నిర్వహించిన కృష్ణ, నాగపూర్‌లో పనిచేసిన గోపికృష్ణ అనే పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లారు. ఈ సందర్భంగా గురువారం సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, సారంగాపూర్ సర్పంచ్ కోనేరు భూమన్న వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి, వారు అందించిన సేవలను ప్రశంసించారు.



పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న సర్పంచ్ కోనేరు భూమన్న



## దొరికిన మొబైల్‌ను పోలీసులకు అప్పగించిన ఫారెస్ట్ సిబ్బంది

**వేమనపల్లి, జూన్ 18, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలం మల్లంపేట అడవి ప్రాంతంలో దొరికిన మొబైల్ ఫోన్‌ను ఫారెస్ట్ బేస్ క్యాంప్ సిబ్బంది నిజాయితీతో నీల్వాయి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఫారెస్ట్ సిబ్బంది అభిత్ ఖాన్, దొబ్బల వినోద్ అడవి ప్రాంతంలో లభించిన మొబైల్ ఫోన్‌ను పోలీసులకు అందజేసి, యజమానిని గుర్తించి అప్పగించాలని కోరారు. ఫారెస్ట్ సిబ్బంది చూపిన నిజాయితీని స్థానికులు అభినందించారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి తగిన ఆధారాలు సమర్పించి నీల్వాయి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి తన ఫోన్‌ను తిరిగి పొందవచ్చని పోలీసులు తెలిపారు. ఈ ఘటన ఫారెస్ట్ సిబ్బంది బాధ్యతాయుత వైఖరికి నిదర్శనంగా నిలిచింది.



## ముల్కలపేటలో ఉపాధి హామీ పనుల పరిశీలన

**వేమనపల్లి, జూన్ 18, ప్రభాతవార్త**

వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న వాటర్ హార్వెస్టింగ్ కుంట నిర్మాణ పనులను గురువారం ఎంపీడీఓ కుమారస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్ రోల్ కాల్ నిర్వహించి కూలీల హాజరును తనిఖీ చేశారు. అనంతరం వేతన కూలీలతో మాట్లాడి, ప్రభుత్వం నిర్ణయించిన రోజువారీ వేతనం రూ.307 పొందేందుకు చేయాల్సిన పని కొలతలు, పనుల నిర్వహణ విధానం గురించి వివరించారు. కూలీలు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేయాలని సూచించారు. ఈ తనిఖీలో ఈసీ మధుకర్, ఎఫ్ఏ అబ్బాగౌడ్, మేట్ తదితరులు పాల్గొన్నారు.

## అడిషనల్ తహసీల్దార్ జి. ఆనంద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీఎస్పీ నాయకులు

**మందమర్రి, జూన్18, ప్రభాతవార్త**

మందమర్రి మండల అడిషనల్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జి. ఆనంద్ కుమార్‌ను బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడంలో అడిషనల్ తహసీల్దార్ జి. ఆనంద్ కుమార్ సమర్థవంతంగా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా జి. ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షులు గాజుల శంకర్, ఉపాధ్యక్షులు ఎం.డి. మతీన్ ఖాన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆరేళ్ల బాలుడిపై వీధి కుక్కల దాడి, తీవ్రగాయాలు

**బెల్లంపల్లి జూన్ 18, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణం, బజార్ ఏరియా కృష్ణ మందిర్ రోడ్ లో ఆరెళ్ల బాలుడిపై వీధి కుక్కలు గురువారం దాడి చేశాయి. స్థానికుల కథనం ప్రకారం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం, గిర్‌వెల్లి గ్రామానికి చెందిన ఆరెళ్ల విహాన్ గౌడ్ తల్లిదండ్రులతో కలిసి చిల్లర సామాను కోనేందుకు బెల్లంపల్లి పట్టణం లోని బజార్ ఏరియాలోని కృష్ణ మందిర్ రోడ్‌కు తల్లిదండ్రులతో కలిసి వచ్చాడు. బాలుడు తల్లి దండ్రులతో వీధిలో నడుచుకుంటూ వెళుతున్నాడు బాలుడిపై వీధి కుక్కలు ఒక్క సారిగా దాడి చేయడంతో బాలుడి మెడపై, తొడలపై తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన బాలుడిని వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బాలుడు చికిత్స పొందుతున్నాడు.

# పంచాయతీల అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలి

**ఆసిఫాబాద్, జూన్ 18, ప్రభాతవార్త :**

జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ తో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని, పంచాయతీ నిధులను ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలని తెలిపారు. త్వరలో 16వ ఆర్థిక సంఘం ప్రారంభం అవుతుందని, 14, 15 ఆర్థిక సంఘాల నిధులను గ్రామపంచాయతీల అభివృద్ధికి పూర్తిగా ఖర్చు చేయాలని తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం క్రింద అర్హులైన లబ్ధిదారుల ప్రతిపాదనలను త్వరగా పంపించాలని, ఆసరా పింఛన్ల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని, రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కొరకు గుడిసెలలో నివసించే వారి వివరాలను పరిశీలించి నివేదిక రూపొందించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ప్రతిరోజు చేపట్టాలని, నివాస ప్రాంతాలలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన త్రాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, వ్యాధుల నియంత్రణకు పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ నెల 28వ తేదీన చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24 వ తేదీ వరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి వారాలు అందించి అవసరమైన ధృవపత్రాలు సేకరించాలని, ఈ ప్రక్రియను విజయవంతం చేయడానికి పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత



## పాత్రికేయులకు అక్రిడేషన్‌తో పాటు సంక్షేమ భరోసా

### - జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్

**ఆసిఫాబాద్, జూన్ 18, ప్రభాతవార్త :**

కుమురం భీం జిల్లాలో 2026-2028 సంవత్సరాలకు సంబంధించిన నూతన అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియ గురువారం జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ప్రారంభమైంది. అక్రిడేషన్ కార్డులతో పాటు జిల్లాలోని పాత్రికేయులందరికీ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించిన్నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు ద్వారా అత్యవసర వైద్య సహాయం, ప్రమాద సమయంలో ఆర్థిక భరోసా, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం వంటి అనేక ప్రయోజనాలు పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులందరూ తమ అక్రిడేషన్ కార్డుల స్వీకరణతో పాటు రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు ప్రక్రియను కూడా పూర్తి చేసుకోవాలని కోరారు. పాత్రికేయుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్రిడేషన్ ప్రక్రియతో పాటు సంక్షేమ కార్యక్రమాలను అనుసంధానం చేయడం ద్వారా పాత్రికేయులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఖఇఅక్రిడేషన్‌తో పాటు సంక్షేమ భరోసాఇఇ అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లాలోని పాత్రికేయుల నుంచి మంచి స్పందన లభిస్తోందని వెల్లడించారు.

## నేడు కాంగ్రెస్ పార్టీ మండల బిఎల్ఏల ముఖ్య సమావేశం

**తాండూర్, జూన్ 18, ప్రభాతవార్త :**

తాండూర్ మండల బిఎల్ఏల ముఖ్య సమవేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్ తెలిపారు. ఈ సమావేశం సురభి గోద్రా ఫంక్షన్ హాల్ లో (మాదారం రోడ్డు) ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘునాథరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ బి ఎల్ ఎ లు, సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## ఛలో అసెంబ్లీ నేపథ్యంలో బీఆర్ఎస్వీ నాయకుల అరెస్ట్

**వేమనపల్లి, జూన్ 18, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల ఖఇఛలో అసెంబ్లీఇఇ కార్యక్రమం నేపథ్యంలో వేమనపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్వీ నాయకులు చెన్నూరి సంతోష్ కుమార్, చెన్నూరి ప్రసాద్, దుర్గం సుధాకర్‌లను నీల్వాయి పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాలను అడ్డుకోలేరని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.



పోలీసుల అదుపులో బీఆర్ఎస్వి నాయకులు

## గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చూడండి

### - జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్ రావు

**చెన్నూరు, జూన్ 18, ప్రభాతవార్త**



వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వర్ రావు అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని సుందర్శాల, నర్సక్కపేట గ్రామాలను గురువారం రోజు జిల్లా పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వర్ రావు సందర్శించారు. గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్ నిర్మాణ పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ, ప్లాస్టిక్ సేకరణ, ఎప్పటికప్పుడు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం నూతనంగా మంజూరైన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. మోహన్, మండల పంచాయతీ అధికారి ఎం.డి. అజ్మత్ అలీ, సర్పంచ్ గుండా మంజుల, ఈ. తిరుపతి పంచాయతీ కార్యదర్శి ఇ. తిరుపతి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## మంత్రి కోమటిరెడ్డిని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

**భైంసా, జూన్ 19, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు రోడ్ల సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. కుబీర్ మండలంలోని సోనారి నుండి కుబీర్ వరకు రోడ్డు పరిస్థితి అధ్వానంగా తయారైందని, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ఆ రోడ్డుకు వెంటనే బీటీ రినేవల్ పనులు (పునరుద్ధరణ) చేపట్టాలని మంత్రిని కోరారు. వీటితో పాటు నియోజకవర్గంలోని ఇతర ప్రధాన రోడ్ల దుస్థితిని, వాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాల్సిన ఆవశ్యకతను మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బీసీ విద్యార్థులు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు రెన్యువల్ చేసుకోవాలి

### - బీసీ సంక్షేమ అధికారి




**నిర్మల్, జూన్ 18, ప్రభాతవార్త:**

వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలను వెంటనే రెన్యువల్ చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి డి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైందని ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న అర్హులైన బీసీ విద్యార్థులు ఆలస్యం చేయకుండా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆ పత్రాల జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తు కోసం బీసీ కుల ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా వివరాలను సిద్ధంగా ఉంచుకుని, ఆన్‌లైన్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన మరింత సమాచారం, సందేహాల నివృత్తి కోసం 9849290043 నంబర్‌లో సంప్రదించాలని డి.శ్రీనివాస్ పేర్కొన్నారు.

## ముళ్లపొదల తొలగింపు.. రహదారికి కొత్త రూపు

**వేమనపల్లి, జూన్ 18, ప్రభాతవార్త**

మండలంలోని ముల్కలపేట గ్రామంలో రహదారికి ఇరువైపులా విస్తరించి పెరిగిన ముళ్లపొదలను సర్పంచ్ ఒడిల కళ్యాణి సుధాకర్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ సాయంతో తొలగించారు. ముళ్లపొదల కారణంగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. రోడ్డు వెంబడి పెరిగిన పొదలు తొలగించడంతో రాకపోకలు సులభతరమయ్యాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



# వనమహోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**వేంపల్లి నర్సరీలో వేప మొక్క నాటి హరితహారానికి శ్రీకారం - అటవీ సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని పిలుపు**

**సిర్పూర్ (టి), జూన్ 18, ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం 2026-27 కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు గురువారం మండలంలోని వేంపల్లి నర్సరీలో వేప మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నర్సరీలో మొక్కల పెంపకం, సంరక్షణ విధానాలను పరిశీలించి అటవీ శాఖ అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జీవ వైవిధ్యానికి నిలయంగా ఉన్న సిర్పూర్ నియోజకవర్గంలోని అటవీ సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా అటవీ సంరక్షణ సాధ్యం కాదని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. అడవుల పరిరక్షణ ద్వారా పర్యావరణ సమతుల్యతతో పాటు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. కన్నెపల్లి మండలంలోని సాలిగాం నల్లవాగు ప్రాంతంలో లక్షల సంవత్సరాల క్రితం రాక్షస బల్లులు సంచరించినట్లు ఇటీవల శాస్త్రవేత్తలకు లభించిన పాదముద్రలు చారిత్రక విశిష్టతకు నిదర్శనమని తెలిపారు. ఇలాంటి అరుదైన సహజ వారసత్వ సంపదను పరిరక్షించేందుకు యువత, మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అడవుల్లోని చెట్లు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ అప్పయ్య, ఎఫ్ఆర్ఓ లక్ష్మణ్, డీఆర్వోలు శశిధర్ బాబు, హేమలత, ఎఫ్ఎస్వోలు జగన్ మోహన్ గౌడ్, కామరాజు, ఎఫ్‌బీఓలు విజయ్, రమాదేవి, స్వాతి, శ్రీనివాస్, సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.






## బడిబాటలో భాగంగా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ డే

**- భవిత కేంద్రంలో నూతన అడ్మిషన్లు**

**- దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :**

బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ డే ను పురస్కరించుకొని కాగజ్‌నగర్ భవిత కేంద్రంలో నూతన విద్యార్థుల అడ్మిషన్లు, దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. భవిత కేంద్రంలో అందుబాటులో ఉన్న ప్రత్యేక విద్య, థెరపీ, కౌన్సెలింగ్ తదితర సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే 18 సంవత్సరాల లోపు వయస్సు గల ఫిజియోథెరపీ అవసరమున్న దివ్యాంగ పిల్లలకు ప్రతి గురువారం, శుక్రవారం భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని కోరారు. అనంతరం నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికి, అవసరమైన దివ్యాంగ ఉపకరణాలను పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, ప్రభుత్వ సంక్షేమ సేవలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ।నిళిశి సతీష్, లీళిది సిబ్బంది మహేష్, శ్రీకాంత్, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జూన్ 18, ప్రభాతవార్త**



జిల్లా వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండలంలోని అటవీ ప్రాంతంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, డిసిపి ఎ. భాస్కర్, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, తహసిల్దార్ సదానందం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్, సర్పంచ్ విజయలక్ష్మిలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. 2026 వనమహోత్సవంలో జిల్లాకు కేటాయించిన 41 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రాణహిత నదిలో స్నానానికి వెళ్లి యువకుడు గల్లంతు!

**- గజ ఈతగాళ్లతో పోలీసుల గాలింపు చర్యలు**

**కోటపల్లి, జూన్ 18, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. మండల పరిధిలోని వెంచపల్లి గ్రామానికి చెందిన అజయ్ గౌడ్ (23) అనే యువకుడు గురువారం ప్రాణహిత నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కోటపల్లి పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక గజ ఈతగాళ్ల సహాయంతో నదిలో అజయ్ గౌడ్ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, ప్రమాద విషయం తెలియగానే యువకుడి కుటుంబ సభ్యులు నది తీరానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. వారి రోదనలు స్థానికులను కలచివేస్తున్నాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు నదిలో కొట్టుకుపోవడంతో వెంచపల్లి గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## నూతన గ్రామ పంచాయతీ భవనం, ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

**భైంసా, జూన్ 19, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని విట్టోలి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన పరిపాలనా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ నూతన పంచాయతీ భవనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో నిర్మించిన నూతన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి వారికి గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. సొంత ఇంటి కల నెరవేరడం ప్రతి కుటుంబానికి ఆనందదాయకమైన విషయమన్నారు. పేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**పెంచికల్ పేట్, జూన్ 18, ప్రభాతవార్త :**



మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు నూతన విద్య సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను గ్రామ సర్పంచ్ షేక్ ఉస్మాన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న బొంబాయిగూడకు చెందిన రామయ్య లక్ష్మిల కుమారుడు సాయి క్రిష్ణ నేపాల్ లో జరిగిన సౌత్ ఆసియేన్ సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభతో విజయం సాధించగా ఆయనను చాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భిణీ స్త్రీలకు గుడ్లు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్యాల శేఖర్, ఉపాధ్యాయులు మూనా, ప్రియాంక, సుమిత్ర, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసిన సర్పంచ్ హల్దే విజయ్

**భైంసా, జూన్ 18, ప్రభాతవార్త:**



భైంసా మండలంలోని కుంభి గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. సర్పంచ్ హల్దే విజయ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించి, ప్రభుత్వం ఉచితంగా చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య, ఉపాధ్యాయులు గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.